www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 ఆగస్టు 2024
5
వైఎస్ఆర్



లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆవరణంలో గల లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను, రైతు బజార్‌లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఉన్న రిజిస్టర్లను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ సందర్శించిన వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే వారి సమీపంలో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించి సలహాలను పొందవచ్చు అని చెప్పారు. కార్యక్రమంలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, రిమ్స్ ఆర్ ఎం ఓ డాక్టర్ రాజేశ్వరి, వైద్య సిబ్బంది, ఎస్టేట్ ఆఫీసర్, సెక్యూరిటీ ఆఫీసర్, రైతు బజార్, కడప లీగల్ ఎయిడ్ క్లినిక్ లలో ఉన్న పారా లీగల్ వాలంటీర్లు కే. ఈశ్వరయ్య, సి. వెంకటసుబ్బయ్య ప్రజలు పాల్గొన్నారు.

వేడెక్కిన జడ్‌పి రాజకీయం!

- తాడేపల్లికి చేరిన ఛైర్మన్ ఎన్నిక వ్యవహారం
- జగన్ బంధువు నరేన్ ఎన్నిక లాంఛనమే?
- టిడిపి సీనియర్ నాయకుడి నుంచి జడ్‌పిటిసిలకు ఫోన్‌కాల్స్
- 21న తాడేపల్లికి జడ్‌పిటిసిలు ప్రయాణం



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ రాజకీయం వేడెక్కింది. అధికార టిడిపి, వైసిపి వ్యూహప్రతివ్యూహాల మధ్య రాజకీయం నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం డిసెంబర్‌లోపు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికను నిర్వహించాల్సి ఉంది. ఆకేపాటి పోటీ చేసిన ఒంటిమిట్ట, రెండో స్థానం కలిగిన పులివెందుల జడ్‌పిటిసి మహేశ్వరరెడ్డి చనిపోవడంతో ఈ రెండు స్థానాలకు ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక బరిలో కమలాపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు జడ్‌పి ఛైర్మన్ ఎన్నిక రేసులో నిలవడం ఉత్కంఠను కలిగిస్తోంది. ఆయన వైసిపి జడ్‌పిటిసిలకు ఫోన్ కాల్స్ చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. టిడిపి నాయకుని వ్యూహానికి విరుగుడుగా వైసిపి తరుపున ఛైర్మన్‌గిరీ రేసులో నిలిచిన చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి టిడిపి నాయకుని వ్యూహాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇటీవల వైజాగ్ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అనుసరించిన వ్యూహాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ గిరిని దక్కించుకునేందుకు అమలు చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ నిర్వహణ అనంతరం జడ్‌పిటిసిలు తాడేపల్లికి చేరుకోవాలనే ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ నెల 21న తాడేపల్లి కేంద్రంగా వైసిపి తరుపున జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం డిసెంబర్‌లోపు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. వైసిపి జిల్లా పరిషత్‌లోని 51 స్థానాల్లో 50 స్థానాల్లో పూర్తి స్థాయి ఆధిక్యత కలిగి ఉంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడంపై సందేహాలు నెలకొన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమారుడు నరేన్‌రామాంజులరెడ్డి పేరు ఛైర్మన్ ఎన్నిక రేసులో తెరపైకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందా, లేక విడుదల చేయకుండానే ఇన్‌ఛార్జి ఛైర్మన్ జేష్టాదేవి శారదను కొనసాగించడం వైపు మొగ్గు చూపిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్
వైద్యుల ఆందోళనకు సిఐటియు మద్దతు



కడప అర్బన్ : వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కలకత్తాలో వైద్య విద్యార్థిని అత్యాచారం, హత్యను నిరసిస్తూ బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్‌లో జూనియర్ డాక్టర్ చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకత్తా నగరంలో ఈనెల 9న వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన సంజయ్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్యులు చేస్తున్న ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని దుర్మార్గంగా చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దారుణానికి ఒడికట్టిన వారిని ఊరికే విడిచిపెట్టకూడదన్నారు. ప్రాణాలు పోసే డాక్టర్లను ప్రాణాలు తీయడం అత్యంత హేయమైన చర్యని తెలిపారు. దేశం దిగ్భ్రాంతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కడప రిమ్స్‌లో డాక్టర్లు ఆందోళన చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ ఆందోళనకు సిఐటియుగా ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతున్నామన్నారు. 17, 18న నెల్లూరులో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 21న, జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేయాలని నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్ర రెడ్డి, రిమ్స్ యూనియన్ కార్యదర్శి సుదర్శన్, నాయకులు భాస్కరు, కొండయ్య, పవన్ దస్తగిరి పాల్గొన్నారు.

వేంపల్లె : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసిన బాధ్యులకు ఉరి శిక్ష వేయాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, జడ్‌పిటిసి మాజీ సభ్యులు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, సుష్మాలు డిమాండ్ చేశారు. సోమవారం అల్ ఆమీన్ సోస్టైటీ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థి మృతికి సంఘీభావంగా వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, లిటిల్ ఫ్లవర్, ఉషాకిరణ్, నారాయణ, శ్రీచైతన్య, దేవి జూనియర్ కళాశాల, అక్షర మహిళా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కాంగ్రెస్, బిజెపి, జనసేనా పార్టీల నాయకులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. వేంపల్లెలోని పుర వీధుల గుండా విద్యార్థులు, రాజకీయ నాయకులు అందరూ ర్యాలీ నిర్వహిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అలాగే వైఎస్ఆర్ సర్కిల్ లో విద్యార్థులు, రాజకీయ నాయకులు మానవహారంగా నిలిచి కలకత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై పాశవికంగా మూకుమ్మడి అత్యాచారం చేసి హత్యకు పాల్పడినట్లు పోస్టుమార్టం రిపోర్టు స్పష్టం చేసిందన్నారు. వెంటనే మానవ మృగాలకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, నారాయణ కళాశాల ఎట భాస్కర, అక్షర జూనియర్ కళాశాల కరస్పాండెంట్ భారతీ రెడ్డి, దేవి కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ మోబినా, డాక్టర్ షాహీనా, డాక్టర్ అబ్దుల్ హూక్, బిజెపి, జనసేన నాయకులు, తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



వేంపల్లె: వైఎస్ఆర్ సర్కిల్‌లో మానవహారం చేస్తున్న విద్యార్థులు

కడప : పశ్చిమ బెంగాల్లో కేజీకర్ ఆస్పత్రిలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులపై వెంటనే తగు కఠిన చర్యలు తీసుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యురాలిపై జరిగిన అత్యంత పాషవిక చర్యను కడప బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పా రు. దోష లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కడప బార్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుందన్నారు. మళ్లీ మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. చంద్రమోహన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎన్. చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి వై.టీ.జే. కెనడీ, కోశాధికారి ఎం.వి. సుబ్బరా మయ్య, లైబ్రరీ సెక్రటరీ పి.నాగభూషణం, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్య.కా.స ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



దీక్షలు చేస్తున్న వ్య.కా.స నాయకులు, పేదలు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మండల పరిధిలోని సి.కొత్తపల్లి రెవెన్యూ పొలంలో భూ కబ్జాదారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం బద్వేల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ సి కొత్తపల్లె రెవెన్యూ పొలం పట్టణానికి మూడు కిలోమీటరు ఉందన్నారు. అక్కడ ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాలు, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలన్నారు. పట్టణ పరిధిలో ఉన్నందున రూ. కోట్లు విలువైన భూములను రాజకీయ పలుకుబడి కలిగిన అగ్రవర్ణాలు, భూకబ్జాదారులు పేదలపై దాడిచేసి యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. ఆరు నెలల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళనలు ధర్నాలు నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం స్పందించటం లేదని వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూకబ్జాలపై శ్వేత పత్రం విడుదల చేశారని, మండల రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించారని, భూ కబ్జాదారుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోకపోతే ఆ సదస్సులు ఉపయోగం లేదన్నారు. భూములను స్వాధీనం చేసుకున్నప్పుడే సదస్సులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. పదేళ్ల నుంచి అసైన్డ్ కమిటీ లేకుండా ప్రభుత్వ భూములకు దొంగ పాసు బుక్కులు ఆన్‌లైన్ చేశారని, ఆ భూములను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు ఇళ్ల స్థలాలకు అనువైన స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సి కొత్తపల్లె భూమిలో పేదలను దాడి చేసిన అగ్రవర్ణాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి గురైనటువంటి బాధితుల పైన కూడా పోలీసులు కౌంటర్ కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు దళిత మహిళల పైనా, పేదల మీద భూకబ్జాదారులు పెట్టిన కేసును ఎత్తివేయాలని లేకపోతే మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. రిలే నిరాహార దీక్షకు ప్రజా సంఘాలు దళిత సంఘాల నాయకులు బండి జకరయ్య, కేశవ, అట్లూరు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్గమ్మ, రమణ మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్షలో మొదటి రోజు దీక్షల్లో వెంకట సుబ్బయ్య, పి వెంకటేశ్వర్లు, పి అనిల్ కుమార్, జింక దేవరాజు, బి మహేశ్వర, పి నారాయణ, ఎస్ శేఖర్, డి యాదయ్య, గోపి పి సమర, కె.చిన్న గురయ్యా, బద్వేల్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్ ,ఓబులేష్, రవిచంద్ర, పుష్పావతి, సునీత, ఓబులమ్మ, మేరమ్మ కూర్చున్నారు.

ఆంక్షలను పరిమితం చేయాలి : ఎస్ఇ




అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారులు సులభతరంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు ఆంక్షలను పరిమితం చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ రమణ కడప విద్యుత్ భవన్ లోని సమావేశ మందిరంలో గృహ వినియోగదారుల సౌకర్యార్థం తమ విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు రాయితీతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడంపై ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని అధికారులతో, సూర్య పలకలను ఏర్పాటు చేసే వెండర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్‌కు అయ్యే ఖర్చు రూ. 70 వేలు అని 2 కిలో వాట్స్ సోలార్ రూఫ్ టాప్‌కు రూ. 1.40 లక్ష అవుతుందని చెప్పారు. గృహాలకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఒక కిలో వాట్ సామర్థ్యంకు రూ. 30 వేలు, 2 కిలో వాట్స్ సామర్థ్యంకు రూ. 60 వేలు, 3 కిలో వాట్స్ సామర్థ్యంకు రూ. 78 వేల చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని అన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే విధంగా ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఒక కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది అని తెలిపారు. దీని ద్వారా ప్రస్తుతం నెలకు రూ. 1000 లు వచ్చే బిల్లు సోలార్ ఏర్పాటు చేసుకున్న తర్వాత సుమారు 338 రూపాయలు తగ్గుతుంది అని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బాధ్యతతో ముందుకు వచ్చి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకొని భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సీతారాముల శ్రావణ పౌర్ణమి కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం సీతారా ములకు కల్యాణం వైభోగంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు కల్యాణం సందర్భంగా ఉభయ దాతలు పట్టు వస్త్రాలు, పూల మాలలు సమర్పించారు. టిటిడి అధికారుల సమక్షంలో ఈ కల్యా ణోత్సవం ఘనంగా వేద పండితులు నిర్వహి ంచారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ దారాలను0 స్వామివారి తరపున అందరి భక్తులకు పంపిణీ చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కల్యా ణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొం దారు. కల్యాణానికి ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్యాండు వాయిద్య మేళం, టిటిడి ఆలయ ఇన్‌సె ్పక్టర్, టిటిడి ఉద్యోగులు, పోలీసులు, సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి-అట్లూరు : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వచ్చిన వరదలో మృతిచెందిన కుటుంబాలను ఆదుకోవడం కోసం సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గమ్మ, రమణ వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. కేరళ ప్రజలు దేశంలో, ప్రపం చంలో ఎక్కడైనా విపత్తు జరిగితే ఆదుకోవడంలో ముందుంటారని, అలాంటి వారికి నేడు విపత్తు రూపంలో కష్టమొచ్చిందని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. వరదల ప్రమాదంలో వయనాడ్ ప్రాం తంలో గ్రామాలు కొట్టుకుపోవడంతోపాటు, సుమారు 400 మంది వరకు మృతిచెందారన్నారు. మనవతా దృక్పథంతో ఆదుకోవాలని పేర్కొన్నారు. విళాల సేకరణలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సుభద్రమ్మ, స్వప్నమ్మ, పాపులమ్మ, మస్తానమ్మ, గంగయ్య., రవిచంద్ర పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : అర్జీదారులు విన్నవించే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) హాలులో జెసి అదితి సింగ్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి లతో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. పోరుమామిళ్ల మండలం నర్సింగ్ కొట్టాలు గ్రామానికి చెందిన సమత తమ గ్రామంలో అంగన్వాడీ పోస్టు ఖాళీగా ఉందని, తనకు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. మైదుకూరు మండలం గంగాయపల్లెకు చెందిన ఎరుకలయ్య తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. వి.ఎన్. పల్లె మండలం, ఇందుకూరుకు చెందిన రైతు లక్ష్మీరెడ్డి జిఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు-2 కాలువ భూసేకరణలో తన వ్యవసాయ భూమి పోయిందని, నష్టపరిహారం అందించాలని వినతిపత్రం సమర్పించారు. మైదుకూరు మండల కేంద్రానికి చెందిన చీపాటి బి.వి. అంజనమ్మ తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం, పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని కలెక్టర్‌ను కోరారు. సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన రమణమ్మ, వేణుగోపాల్ తమ ఊరు మునక ప్రాంతం అని, లోమడ చెరువులో తమ భూములు మునిగిపోయని నష్టపరిహారం అందించడంలో ఎవరూ పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయకుమార్, వ్యవసాయ, శాఖ జేడీ నాగేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, సిపిఒ వెంకట రావు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిటిసి మీరా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు

ఆయాలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

అంగన్వాడీ ఆయాలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, టీచర్లకు బదిలీలు ఇవ్వాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఐటియు, అంగన్వాడీ యూనియన్‌గా అనేక పోరాటాలు నిర్వహించిన ఫలితంగా హెల్పర్స్ కు ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. 40 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలు ఏజ్ రిలాక్షన్ జరిగిన చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అందరికీ ప్రమోషన్ ఇచ్చారని, కడప జిల్లాలో ఇవ్వలేదన్నారు. బదిలీలకు అర్జీలు పెట్టుకున్న వారిని వెంటనే బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ అర్హులైన వారికి, సంవత్సరంలో పెండింగ్ ఉన్నవారికి ఇవ్వాలని ఐసిడిఎస్ పీడీకి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు చంద్రారెడ్డి ఉన్నారు.

ఫొటోగ్రఫీ శాఖగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని ఫొటోగ్రఫీ శాఖను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి. విసి ఆచార్య జి.విశ్వనాధ కుమార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ విద్యార్థులు తీసిన చిత్రాల నుంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ డిపార్ట్మెంట్ అధ్యాపకులు, అధ్యాపకేతర, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప : ఆ స్థలం బండ్ల బాట కాదు పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలం అని, తమకు న్యాయం చేయాలని సోమవారం కడప తహశీల్దార్ నారాయణరెడ్డికి పట్టాదారులు మల్లెం విజయ భాస్కర్, శ్రీరాములు, సాంబశివుడు, విజయ శేఖర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం పుట్లంపల్లి గ్రామం సర్వే నంబర్ 2/2 లోని ఒక ఎకరా 73 సెంట్లు రెవెన్యూ రికార్డు ప్రకారం వంక కాలువ ఉందన్నారు. ఈ భూమి ఆనుకొని ప్రతాప్ పబ్లిక్ స్కూల్ వారి భూమి ఉందని తెలిపారు. దీని పక్కన ఉన్న కాలువ పరంబోకు 28 సెంట్లు స్థలం ఉందని చెప్పారు. రెవెన్యూ రికార్డు ప్రకారం కొంత స్థలం ప్రభుత్వ పరంబోకుగా ఉందని, ఈ స్థలం ఇల్లు లేని పేదలకు ఇచ్చే ందుకు అనుకూలంగా ఉందని 1998లో అప్పటి మండల రెవెన్యూ అధికారి ఖాదర్‌బాషా సత్యనారాయణ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులకు అనుమతి కోసం లెటర్ రాసిపంపారన్నారు. అప్పటి తహశీల్దార్‌సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ వారు ఎటువంటి అభ్యంతరం లేదని నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారన్నారు. అధికారులు విచారణ చేసి మాకు ఇళ్ల పట్టాలు కేటా యించారన్నారు. ఇటీవల మున్సిపల్ సర్వేయర్ విచారణ నిమిత్తం వచ్చినప్పుడు వాస్తవాలు తెలుసుకున్నారని తెలిపారు. తాము ఇళ్లు నిర్మించుకుంటే రంగారెడ్డి, సాదక్‌బాషా అనే బ్రోకర్లు, తమల్ని ఇబ్బంది పెడుతున్నారు. వీరిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఎస్.వి రమణ, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, మండల ఉపాధ్యక్షుడు మౌలాలి మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ యువత నాయకులు జై సింహారెడ్డి విజయ సింహారెడ్డి రమణ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి సోమవారమూ ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తాం

ప్రజాశక్తి-చెన్నూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారమూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఫిర్యాదుదారులకు నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ జీవన్ చంద్రశేఖర్ తెలిపారు, సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యుఇటిడబ్ల్యూయు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై సెప్టెంబర్ 5న తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 ఏళ్ళుగా పనిచేస్తున్న 23,500 విద్యుత్ కార్మికులను నూతన ప్రభుత్వం రెగ్యులర్ చేసి కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని పేర్కొన్నారు. నైపుణ్యంలేని కార్మికులకు నైపుణ్య స్కిల్ వేతనం ఇవ్వాలన్నారు. కొత్త ఆపరేటర్లుగా ఉన్న వారందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనం , ఇపిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలని అలాగే కార్మికుడి కానీ, వారి కుటుంబాల్లో గాని ఏదైనా అనారోగ్య, యాక్సిడెంట్లు సమస్య వచ్చినప్పుడు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వమే వైద్యం అందించాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. తిరుపతిలో నిర్వ హించోయే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైదుకూరు డివిజన్ కార్యదర్శి టిసి కొండయ్య, యుఇఇయు జిల్లా నాయకులు ప్రసాద్ ,సుబ్బారావు, సురేష్, బద్వేల్ సబ్ డివిజన్ నాయకులు ప్రవీణ్, జి.వి. సురేష్, ఆదినారాయణ విద్యుత్ కార్మికులు సుధాకర్, కరీం, రమణ, వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు జాన్సన్ రామాంజనేయులు సుధాకర్, సంజీవ్ వాచ్మెన్ శ్రీనివాసులు పాల్గొన్నారు



ప్రత్యేకపూజలో పాల్గొన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విగ్రహ ప్రతిష్టాపనలో ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో వెలసిని శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలు వైభవంగా ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు రామ్మోహన్ రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

- సిఐగా బాధ్యతలు చేపట్టిన హాజీవలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



పులివెందుల మున్సిపాలిటీలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపడ తామని ట్రాఫిక్ సిఐ హాజీవలి తెలిపారు. ఆయన సోమవారం పులివెందుల పట్టణ ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల ముందు వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయివేట్ బస్సులు రోడ్లపై ఉంచితే చర్యలు తప్పవన్నారు. రాత్రి వేళల్లో మాత్రమే లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవాలన్నారు. గతంలో ఆయన పులివెందుల టౌన్ ట్రాఫిక్, లింగాల మండల ఎస్ఐగా పనిచేశారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సంతోషంగా ఉండాలంటే శాంతి భద్రతలు ముఖ్యమని, వాటిని కాపాడేందుకు ప్రజలందరూ సహక రించాలని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కోరారు. యర్రగుంట్ల నుంచి బది లీపై వచ్చిన భాస్కర్‌రెడ్డి సోమ వారం ఆర్కేవ్యాలీ ఎస్ఐగా బాధ్య తలు స్వీకరించారు. వేంపల్లె సిఐ సురేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి నిఘా పెడతామన్నారు. మట్కా, జూదం వంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుక రావాలన్నారు. చిన్న విషయాలకు ఘర్షణ పడి జీవితాలను నాశనం చేసు కోవద్దని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలోని బోడెద్దులపల్లెకు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (35) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడు వృత్తిరీత్యా వెల్డింగ్ పని చేస్తుంటాడు. రోజూలాగే సోమవారం బుగ్గలపల్లె పంచాయతీ పరిధిలోని గూడా వండ్లపల్లె ఎస్సీ కాలనీలో ఇంటి దగ్గర రేకులు బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు మగ పిల్లలున్నారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరు తు న్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

కారుకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పంటించారు. సోమవారం వీరపునాయనపల్లి మండలం ఎర్రమలపల్లె గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి వేంపల్లెలోని శ్రీ చైతన్య పాఠశాల సమీపంలో బెలోనో కారు పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కారుకు నిప్పు పెట్టడంతో కారు వెనక భాగం కాలి పోయింది. బాధితుడి సమాచారం మేరకు పోలీసులు ఘటన జరిగిన సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

మద్యం మత్తులో బీరు సీసాలతో దాడి

- వ్యక్తికి గాయాలు, నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - చెన్నూరు

మద్యం మత్తులో నలుగురు దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ పురుషోత్తంరాజు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాసులురెడ్డి, శివ, ప్రసాద్, రాజ అనే నలుగురు వ్యక్తులు చెన్నూరు పెట్రోల్ బంక్ సమీపంలో మద్యం సేవిస్తూ ఉండగా, అక్కడికి గంధం సుబ్బరాయుడు, అలియాస్ పెద్ద చిలక అనే వ్యక్తి రాగా అందరూ కలిసి మద్యం సేవించారు. గంధం సుబ్బరాయుడు ఇంటికి వెళ్లి పిడిబాకు తీసుకొని వచ్చి వారితో వాగ్వాదానికి దిగాడు. నలుగురు వ్యక్తులపై అతను పిడి బాకుతో దాడి చేయబోగా వారు బీరు సీసాతో గంధం సుబ్బరాయుడు అలియాస్ చిలక తలపై కొట్టారు. దీంతో సుబ్బ రాయుడుకు గాయ పడ్డాడు. గాయ పడిన సుబ్బ రాయుడు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

విద్యుత్ శాఖలో వేధిస్తున్న మెటీరియల్ కొరత

- ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం



లైన్‌లాగక నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభం

విద్యుత్ శాఖలో మెటీరియల్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి విద్యుత్ శాఖలో ఇన్సులేటర్లు, పిన్నులు, వికాసారాలు, టాప్‌లీడ్లు, కండక్టరు, కేబుల్ వైరు లేకపోవడంతో బయటి మార్కెట్లో కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపో తున్నారు. ముఖ్యంగా పులివెందుల డివిజన్ పరిధిలోని సింహాద్రిపురం, లింగాల, పులివెందుల రూరల్, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రా యపేట, మండలాలున్నాయి. ఆయా మండలాల్లో ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకున్న 262 మంది రైతులకు సంబంధించిన పనులు పూర్తి చేయాల్సింది. అయితే ఆయా మండలాల పరిధిలోని స్టోర్లలో కేవలం విద్యుత్ స్తంభాలు, అరకొరగా మెటీరియల్ మాత్రమే ఉండడంతో కాంట్రాక్టర్లు విద్యుత్తు స్తంభాలు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. కేబుల్ వైర్, కండక్టర్ ఉన్న మండలాల్లో ఇతర మెటీరియల్ లేకపోవడంతో బయట మార్కెట్లో కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇబ్బందులు పడుతున్న రైతులు..

కొత్తగా బోరు వేసుకొని పంట సాగు చేసుకోవాలనుకుంటున్న రైతులకు విద్యుత్తు కనెక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల చుట్టూ అనేకమార్లు తిరుగుతున్నప్పటికీ మెటీరియల్ కొరతతో తాము చేసేది ఏమీ లేదని రైతులకు చెబుతున్నారు. మెటీరియల్ స్టాక్ రాగానే పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

మెటీరియల్ కొరత వాస్తవమే..

పులివెందుల డివిజన్ పరిధిలో మెటీరియల్ కొరత ఉన్న విషయం వాస్తవమే. కేబులు, కండక్టర్‌తో పాటు ఇతర మెటీరియల్ కావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మెటీరియల్ రాగానే పనులను పూర్తి చేస్తాం. రైతుల సమస్యలను పరిష్కరిస్తాం.

- శ్రీనివాసులు, విద్యుత్ శాఖ డిఇఇ, పులివెందుల

రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదు



మార్కెట్ యార్డులో చీనీ కాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చీనీ మార్కెట్ ధరలపై రైతులకు అన్యాయం జరుగుతే సహించేదిలేదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లోని చీనీ వ్యాపారస్తుల వద్దకు సోమవారం ఆయన వెళ్లి అక్కడ జరుగుతున్న వేలంపాట ప్రక్రియను పరిశీలించారు. తమకు అన్యాయం జరుగుతోందని పలువురు రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎక్కడైనా మార్కెట్ యార్డ్ అధికారులు, సంబంధిత ఉద్యోగస్తులు రైతులకు న్యాయం జరిగేలా నడుచుకుంటారు కానీ.. పులివెందులలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వ్యాపారులతో కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఢిల్లీ, నాగపూర్ తదితర మార్కెట్ ధరలను చూసుకుని గిట్టుబాటు ధర వచ్చేలా అధికారులు ప్రయత్నిం చాలన్నారు. ఇప్పటికైనా వ్యాపారం చేస్తున్న వారైనా, అధికారులైనా తమ పద్ధతులు మార్చుకోవాలన్నారు. లేనిచో భవిష్యత్తులో ప్రభుత్వమే చీనీ కాయలను కొనుగోలు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణారెడ్డి, మైసూరారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్ ప్రజలకు ఉపయోగపడేలా చేయాలి : ఎమ్మెల్సీ

పులివెందుల రూరల్ : స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఉన్న రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సంబంధిత అధికారి రుచితకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు వెంటనే కూరగాయలు అమ్మేవారికి రైతుబజార్‌పై అవగాహన కల్పించాలన్నారు. వ్యాపారులు రైతు బజారులో దుకాణాలను ఏర్పాటు చేసుకునేలా చేయాలన్నారు. ప్రభుత్వం ఇంత ఖర్చు పెట్టి రైతుబజార్ నిర్మించిందని, మార్కెట్ సిబ్బంది కూడా బాధ్యత వహించాలన్నారు. వీలైనంత త్వరగా ప్రజలకు రైతుబజార్‌ను అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో బొజ్జ మైసూరారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, శివారెడ్డి, గంగిరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సరళ రుణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సరళ రుణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిజిబి జిఎం పి.ఆర్ పడగెటవార్ కోరారు. స్థానిక ఎపిజిబి (మెయిన్ బ్రాంచి)లో ఏర్పాటు చేసిన సరళ రుణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సరళ రుణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం నుంచి అవసరమైన రుణాలను అందించేందుకు తమ బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. ఖాతాదారుల శ్రేయస్సు ప్రధాన లక్ష్యంగా ఎపిజిబి పని చేస్తుందన్నారు. అన్ని బ్యాంకుల కంటే డిపాజిట్లపై తమ బ్యాంక్ అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. తమ బ్యాంకు సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ ప్రసాద్, కడప ఎస్ఆర్‌కె ఇన్‌ఛార్జి షరీఫ్, రీజినల్ ఆఫీస్ ఎస్ఎం ప్రశాంత్, పులివెందుల మెయిన్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రాజేష్, పులివెందుల సరళ రుణ కేంద్రం మేనేజర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు కిరణ్ కుమార్, ఉమామహేశ్వరి, రోహిణికుమారి, ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, శశిధర్, నల్లపురెడ్డిపల్లి, అలవలపాడు, పులివెందుల పూల అంగళ్ళు బ్రాంచ్, వేముల వేంపల్లి, లింగాల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిఎం పి.ఆర్ పడగెటవార్

తాగు, సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం



నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, భూపేష్‌రెడ్డి


ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజలకు తాగునీరు, రైతులకు సాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మండలంలోని శెట్టివారిపల్లె గ్రామం వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ గేట్లను తెరచి సోమవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, భూపేష్‌రెడ్డి జిఎన్ఎస్ఎస్ కాలువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గాలేరు నగరి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు నీటిని వామికొండ, సర్వరాయ సాగర్, రిజర్వాయర్లకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల నియోజకవర్గానికి గండికోట నీరు

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ ద్వారా టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి సోమవారం నీటిని విడుదల చేశారు. పైడిపాలెం రిజర్వాయర్‌కు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 టిడిపి ప్రభుత్వంలోనే ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని పులివెందుల నియోజకవర్గానికి చంద్రబాబు ఇచ్చారన్నారు. ఈ నీటి ద్వారా పులివెందుల నియోజకవర్గం సస్యశ్యామలంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్ చేస్తున్న బీటెక్ రవి

టౌన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి

- బ్యాంక్ అధ్యక్షులు బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి తన శాయిశక్తులా కృషి చేసి, ఆర్థికంగా ఎదిగేందుకు పాటు పడతానని ఆ బ్యాంక్ అధ్యక్షులు బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. టౌన్ బ్యాంక్ ఎన్నికలు సోమవారం నిర్వహించగా, ఆయన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వెంకటసుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తాను 17 సంవత్సరాలుగా టౌన్‌బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నానని తెలిపారు. 12 మంది డైరెక్టర్లకుగాను తనకు 8 మంది మద్దతు తెలిపారన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, యువనాయకుడు కొండారెడ్డి, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బద్వేల్ శ్రీనివాసులరెడ్డి, ఇవి సుధాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సహకార సంఘం బ్యాంక్ కంప్యూటరీకరణ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకులో సభ్యులు తమ ఆధార్ కార్డును ఫోన్ నెంబర్‌తో కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని బ్యాంకు సీఈఓ జాన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణ చేస్తున్నారని, ఇందులో భాగంగా ప్రతి సభ్యుడు అప్డేట్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు మంజూరు కావన్నారు. అలాగే సహకార సంఘం ఎన్నికలు జరిగినప్పుడు ఓటు హక్కును కోల్పోతారన్నారు. రుణాలపై ఇచ్చే వడ్డీ మాఫీకి కూడా అనర్హులవుతారని, పంట నష్టపరిహారం అందదని ఆయన తెలిపారు. ప్రతి రైతు కేవైసీ తప్పక చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సొసైటీల ఆధునీకరణలో భాగంగా కంప్యూటర్ సామగ్రి మంజూరు చేసిందన్నారు. రైతుల నుంచి భూమి పాసుపుస్తకం, ఆధార్, ఫోన్ నెంబర్, ఫొటో సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసులకు రాఖీ కట్టిన ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను సందర్శించి పోలీసులకు రాఖీలు కట్టారు. తమకు రక్షగా ఉన్నవారు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా డిఎస్పీ భక్తవత్సలంకు రాఖీ కట్టారు. కళాశాల కో-ఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్ ఎన్‌సిసి ఇన్‌స్ట్రక్టర్ దావీద్ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నిరుద్యోగ యువత స్కిల్ హబ్ కేంద్రం అందిస్తున్న నాలుగు నెలల ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ అశోక్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి.నాగార్జున ఒక సంయుక్త ప్రకటనలో సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉపాధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ హబ్ కేంద్రంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఆపై చదివి ఆసక్తిగల విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు కళాశాలలో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ రవీంద్రారెడ్డి

చాపాడు : చాపాడు తహశీల్దార్ రవీంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ నెల 5న కొత్తగా బాధ్యతలు చేపట్టి సెలవుపై వెళ్లిన విషయం విదితమే. ఎన్నికల బదిలీల్లో భాగంగా నంద్యాలలో పనిచేసిన ఆయనను జిల్లాకు వచ్చిన తర్వాత చాపాడు తహశీల్దార్‌గా నియమించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా యామిని బాధ్యతలు నిర్వహించారు.

కనీస వసతులు కల్పించాలని వినతి

ఎర్రగుంట్ల : నగర పరిధిలో కనీస వసతులు కల్పించాలని సోమవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ సమితి కార్యదర్శి ఎంవి సుబ్బారెడ్డి మాటాడుతూ జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని కోరారు. పలు సమస్యలను వినతి పత్రంలో వివరించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బి.ప్రతాప్, వై. శివప్రసాద్‌రెడ్డి, జగనన్న కాలనీ వాసులు రాజు, గురువయ్య, ఇమ్రాన్, ఇమామ్, హుస్సేన్, పద్మావతి, బ్రహ్మంరెడ్డి పాల్గొన్నారు.